కథ



# దొంగ

**-యర్రమిల్లి ప్రభాకరరావు**

**నే**ను బ్యాంకు మేనేజరుగా ఆ గ్రామానికి వచ్చి దాదాపు ఆరు నెలలు దాటింది. ఇక్కడ విజయవంతంగా పని చేస్తే ప్రమోషన్ కూడా వస్తుంది. నేను ఛార్జి తీసుకున్నప్పటి నుంచి అదే దృష్టితో పని చేస్తున్నా.

బ్రాంచి మేనేజరుకు వున్న బాధ్యతలలో ముఖ్యమైనవి రెండు. ఖాతాదారుల నుండి డిపాజిట్లు సేకరించడం ఒకటి. రెండవ బాధ్యత ఋణాలనిచ్చి సకాలంలో వసూలు చెయ్యడం. ప్రస్తుత పరిస్థితుల్లో మొండి బాకీలు ఎంత వసూలు చేస్తే నాకు అంత మంచి పేరు వస్తుంది, ఆఫీసు సర్కిల్స్‌లో గౌరవం పెరుగుతుంది, పనిలో గుర్తింపు వస్తుంది.

గత మూడు సంవత్సరాలుగా మా బ్రాంచిలో మొండి బాకీలు బాగా పేరుకొనిపోయాయి. దానికి ముఖ్య కారణం వర్షాలులేక పంటలు సరిగ్గా పండకపోవడం. చిన్న రైతులు, సన్నకారు రైతులు వర్షంమీదే ఆధారపడతారు. వర్షాకాలం పంట బాగానే రావచ్చు. కాని వేసవికాలం పంట చేతికి అందవచ్చు లేకపోతే అందకపోవచ్చు. అంతా వరుణ దేవుడి దయ.

నాకు వున్న బాకీదారులలో రాజయ్య ఒకడు. అతనికి బ్యాంకు రెండు వేల రూపాయల లోన్ మంజూరు చేసింది పంట నిమిత్తం. మూడు సంవత్సరాలు దాటుతోంది. పైసాకూడా జమ చేయలేదు. వడ్డీ కూడా దాదాపు ఏడు, ఏనిమిది వందలు దాటుతోంది. అతడు వుండే గ్రామం చాలా దూరం. దాదాపు ఇరవై కిలోమీటర్లు వెళ్ళి రావాలి. రెండు మూడుసార్లు కబురు చేస్తే బ్యాంకుకు వచ్చాడు. కాని ఆ సమయంలో నేను బ్యాంకులో లేను. అందుచేత అతనిని చూడడం పడలేదు. ఇప్పుడు నాకు అతని లోన్ వసూలు చెయ్యడం చాలా ముఖ్యం. వసూలు చెయ్యకపోతే నా మీద బాడ్ రిమార్కు వస్తుంది.

ఫిబ్రవరి నెల. ఒక ఆదివారం తీరుబడి చేసుకొని రాజయ్యను కలుసుకోవడానికి మోటర్ సైకిలు మీద వెళ్ళాను. ఎందుకైనా మంచిదని రాజయ్య ఫోటో కూడా తీసుకు వెళ్ళాను. మా రికార్డులో ఖాతాదారుల ఫోటోలు కూడా వుంటాయి.

మునసబు గారు రాజయ్యకు కబురు పెట్టారు. అదృష్టవశాత్తు రాజయ్య ఊర్లోనే వున్నాడు. కబురు చెయ్యగానే వచ్చాడు. నన్ను చూసి నమస్కారం పెట్టి ''అయ్యగారూ! మీరే స్వయంగా వచ్చారా! గత మూడు సంవత్సరాల నుండి పంటలు పండడం లేదు, వర్షాలు లేవు, అందుచేత బాకీ చెల్లించలేకపోయాను. ఈసారి ఏదో రకంగా బాకీ ఎత్తేస్తాను. దయ వుంచండి'' అన్నాడు. నేను కోపంతో 'నీకు అసలు బుద్ధి వుందా! బ్యాంకు తక్కువ వడ్డీకి అప్పు ఇస్తే అది కట్టకుండా ఎగవెయ్యాలని చూస్తున్నావా! కోర్టులో కేసు పెడతా. జాగ్రత్త'' అని గట్టిగా అరిచాను. అప్పటికే చుట్టుప్రక్కల చాలా మంది చేరారు. రాజయ్య మౌనంగా తలదించుకున్నాడు. ''నీ పొలం చూస్తాను పద'' అన్నాను. ఇద్దరం కలిసి ఊరు బయటవున్న అతని పొలానికి వెళ్ళాం. వరి పంట వేశాడు. దిగుడు బావి వుంది. అందులో నీళ్ళు ఎక్కడో పాతాళంలో వున్నాయి. ఆయిల్ ఇంజను పెట్టి పంటకు తడి పెడుతున్నాడు.

నేను రాజయ్యను అడిగాను ''ఎన్ని ఎకరాల భూమి నీది?''

''ఎంత బాబు! అర ఎకరం. ఏడు, ఎనిమిది బస్తాలు పండొచ్చు భగవంతుడు దయ తలిస్తే. ఈసారి మార్చిలో బాకీ పూర్తిగా తీర్చేస్తాను'' అన్నాడు. ప్రస్తుతానికి కాగితాల మీద సంతకం తీసుకున్నా. మిగిలిన రైతులు, మునసబు గారు రాజయ్య మంచి వాడేనని సర్టిఫికెట్ ఇచ్చారు.

నేను అప్పుడు రాజయ్య వంక పరీక్షగా చూశాను. వయస్సు ముప్పై సంవత్సరాలు వుంటాయి. కాని ఫోటోలో వున్నంత ఆరోగ్యంగా, బలంగా నాకు కనిపించలేదు. ఒక జత ఎడ్లు, బండి కూడా ఉన్నాయి. పొలం గట్టు మీదే చిన్న పూరి పాకలో వుంటున్నాడు. పెళ్ళయింది. భార్య రత్నం, తనూ అంతే. రత్నం భయంభయంగా చూస్తోంది.


''బాబు గారూ తమకి కాఫీ కూడా ఈయలేకపోతున్నా -

మంచి ఎండలో వచ్చారు. కొద్ది గా చల్లని మంచినీళ్ళు పుచ్చుకోండి. మిమ్మల్ని చాలా ఇబ్బంది పెట్టాను'' అన్నాడు రాజయ్య నమ్రతగా రెండు చేతులూ జోడించి.

ఫోటోలో వున్న రాజయ్యకు, నేను నా కళ్ళతో చూస్తున్న రాజయ్యకు చాలా తేడా వుంది. రాజయ్య చాలా చిక్కిపోయి, బలహీనంగా వున్నాడు. బుగ్గలు సొట్టబోయాయి. కళ్ళు లోతుకు వెళ్ళిపోయాయి.

రాజయ్య మాటలు వింటూంటే నా మనస్సు ఎక్కడో కలుక్కుమంది. తన తాత, తండ్రుల నుంచి వచ్చిన ఆ కాస్త పొలం, బండెద్దులు తప్ప అతనికి ఇంక ఆస్తి ఏమీ లేదు. తినడానికి సరైన తిండి, కట్టుకోడానికి బట్టలు కూడా లేవు. చినిగిపోయిన పంచె కట్టుకున్నాడు. శరీరం మీద చొక్కా కూడా లేదు. మాసిపోయిన కండువాతో తన శరీరాన్ని గౌరవంగా కప్పుకున్నాడు. రత్నం కూడా ఏదో చీర, జాకెట్టు అనబడే దుస్తులతో నిలబడింది. ఆ జీర్ణ వస్త్రాలలో వాళ్ళని చూసి నేను ఇంక వుండలేకపోయాను. ''సరే రాజయ్యా! నేను వస్తాను'' అని అక్కడ నుంచి వచ్చేశాను.

ఏప్రిల్ నెల మొదటి వారం. ఆదివారం నాకు సెలవు. నేను మా అమ్మాయి వసుంధర ఇంటి ముందర కూర్చొని కబుర్లు చెప్పు కొంటున్నాం. వసుంధర నాకు ఒకే ఒక కూతురు. ఎనిమిదేళ్ళు వుంటాయి. మా ఆవిడ వంటింట్లో పని చేసుకుంటోంది.


(గ్రాఫిక్స్: భాస్కర్)

ఇంతలో రాజయ్య, అతనితో పాటు మునసబు గారి గుమస్తా వచ్చారు. రాజయ్య వస్తాడని నేను అనుకోలేదు.

''నమస్కారం అయ్యగారు'' అన్నాడు రాజయ్య.

రాజయ్య వెనకాలే మా బ్యాంకు అసిస్టెంటు కూడా వచ్చాడు. ''మీ ఇల్లు తెలియదంటే తీసుకు వచ్చాను సార్!'' అన్నాడు.

''ఏం రాజయ్యా. డబ్బు తెచ్చావా!'' అని అడిగాను.

'అవునయ్యా!' అంటూ మునసబు గారి గుమస్తా వైపు చూశాడు.

గుమస్తా ''మేనేజరు గారూ - ఇతని బాకీ కింద మూడు వేల రూపాయలు జమవేసుకోండి. ఇంకా కట్టవలసినది ఏమైనా వుంటే రేపు మునసబు గారు బ్యాంకుకి వచ్చి కట్టేస్తారు'' అంటూ నా అసి



స్టెంటుకి మూడు వేల రూపాయలు అందించాడు.

''మరి రశీదు'' అన్నాను నేను.

''రేపు ఇవ్వండి సార్! మీ దగ్గర రశీదు ఎక్కడకు పోతుంది. రాజయ్యకు ఇస్తే డబ్బు మీకు ఇవ్వడేమోనని అనుమానం వేసి నన్ను పంపించారు మునసబు గారు'' అన్నాడు గుమస్తా వెళ్ళిపోతూ.

''మాకు రాజయ్య మీద నమ్మకం లేదు. మీరు కూడా రావడం మంచి పని. రాజయ్య డబ్బు ఇవ్వకపోతే చాలా కష్టం అందరికీ'' అన్నాడు నా అసిస్టెంటు.

రాజయ్య మౌనంగా నిలబడ్డాడు. నాకు మా అసిస్టెంటు మాటలు నచ్చలేదు. సంభాషణ మార్చే ధోరణిలో ''ఏం రాజయ్యా! పంట బాగా పండిందా?'' అన్నాను.

''లేదయ్యా. నీళ్ళులేక చేను సరిగ్గా పండలేదు. దేవుడు చిన్న చూపు చూశాడు ఈసారి కూడా. నేల మునసబు గారికి ఇచ్చేశా. నా దగ్గర డబ్బు వచ్చినప్పుడు ఆయన దయతలిస్తే నా భూమి నాకు వస్తుంది. ఇప్పుడు బ్యాంకు బాకీ తీర్చాలి కదా! లేకపోతే మాట పోతుంది. అంచేత ఈ ఏర్పాటు చేసుకున్నా'' అన్నాడు రాజయ్య గద్గద స్వరంతో.

''మరి నీ వ్యవసాయం''

''మాదేముందయ్యా! ఇక్కడ పనీలేదు, తిండీ లేదు. పట్నం వెళ్ళిపోతున్నాం బండిలో సామాను వేసుకుని. ఏదైనా కూలీ చేసుకొని బ్రతుకుదామని'' అన్నాడు చెమర్చిన కన్నులతో.

ఇంతలో మా అసిస్టెంటు ''సర్. ఐదు, ఆరు బస్తాల ధాన్యం పొలంలో పండినది కూడా బండిలో వేసుకొని పోతున్నాడు సార్! మనకి పంట మీద కూడా హక్కు వుంటుంది'' అన్నాడు.

రాజయ్య ఏం మాట్లాడలేదు. తన పొలంలో తానే దొంగతనం చేసినట్టు అతను సిగ్గుతో, అవమానంతో తలవంచుకొని నిలబడ్డాడు.

నా స్టాఫ్ రాజయ్యను రెండుసార్లు దొంగగా చిత్రీకరించడం నాకు చాలా బాధ కలిగించింది. నేను ''మీరు అలా అనకూడదు. చాలా తప్పుగా మాట్లాడుతున్నారు. రాజయ్య భూమిని నమ్మి కష్టించి పనిచేసే రైతు. తన పొలంలో తానే దొంగతనం చేయడం ఏమిటి? చట్టం కూడా వాస్తవ పరిస్థితులను విస్మరించదు. అతను పేదవాడు కావచ్చు, చదువులేని వాడు కావచ్చు కాని దొంగకాదు'' అన్నాను కోపంతో ఇంగ్లీషులో. నేను చెప్పినది రాజయ్యకు అర్థం కాలేదు. అతను మౌనంగా నిలబడ్డాడు. మా బ్యాంకు అసిస్టెంటు మనసులో ఏమి అనుకున్నాడో కాని వెంటనే అక్కడ నుండి వెళ్ళిపోయాడు.

మాట తప్పని రాజయ్యను చూస్తే నాకు ప్రేమ, అభిమానం ముందుకు వచ్చాయి. రాజయ్యతో నాకు ఇంతకు ముందు పెద్ద పరిచయం లేదు. అతడు నాకు బంధువూ కాడు, మిత్రుడూ కాడు. సంకుచిత భావాలు, స్వార్థం, దిగజారుతున్న మానవతకు ప్రతీక అయిన ఈ ఇరవై ఒకటవ శతాబ్దంలో కూడా రాజయ్యలాంటి నిష్కల్మష హృదయులు వుండబట్టే భారతీయ సమాజం ప్రపంచంలో తలెత్తుకొని నిలబడుతోంది. రాజయ్య నా కళ్ళకు సజీవంగా వున్న భారతీయ ఆత్మకు ప్రతిబింబంగా కన్పించాడు.

రాజయ్య మౌనంగా నిలబడ్డాడు. తాను వెళ్ళిపోవడానికి నా అనుమతి కోసం చూస్తున్నాడు. నా కళ్ళమ్మట నీళ్ళు తిరిగాయి. నేను ఇంట్లోకి వెళ్ళాను. సాయంకాలం టౌన్‌కి వెళ్ళి పండగకి పాంటు, షర్టు కొనుక్కోవాలని దాచి వుంచిన ఐదు వందల రూపాయలు తెచ్చి రాజయ్య చేతిలో పెట్టాను.

''రాజయ్యా! ఇది నీ దగ్గర వుంచు. పట్నంలో ఏదైనా అవసరం వస్తుంది. మళ్ళీ ఉగాదికి రత్నం, నువ్వు మనవూరు వచ్చెయ్యాలి. నీ పొలం చూసుకోవాలి'' అన్నాను.

అప్పుడే రత్నం కూడా వచ్చింది. అంతా చూస్తోంది. ఇద్దరూ నా వద్దకు వచ్చి నా కాళ్ళకు నమస్కారం చేశారు. రత్నం మా అమ్మాయి వసుంధరను దగ్గరకు తీసుకుని గట్టిగా ముద్దు పెట్టుకొంది. ధారా ప్రవాహంగా వస్తున్న కన్నీరును తుడుచుకుంటూ ''మీరే మాకు దేవుడు బాబుగారూ'' అంది- ఇద్దరూ బండి దగ్గరకు వెళ్ళిపోయారు.

బండి కనుమరుగు అవుతోంది. నాకు తెలుసు. నేను డబ్బు ఇవ్వడం మా ఆవిడకు అసలు ఇష్టం వుండదు. నేను చేసిన పని పిచ్చిపనిగా ఆమెకు తోస్తుంది. ఆమెకే కాదు. ఎవరికైనా అలాగే అనిపించవచ్చు. పండగకు నాకు కొత్త బట్టలు వుండవు. లేకపోతేనేం. నా మనస్సు ఇప్పుడు చాలా ప్రశాంతంగా వుంది. నాకు ఎప్పుడూ కలగనంత అనిర్వచనీయమైన తృప్తి కలిగింది.

నేను చేసిన పనిని హర్షిస్తున్నట్టుగా ఇంటిముందర మామిడిచెట్టుపై నుండి కోయిల మధురంగా 'కుహూ కుహూ' అని గానం చేస్తోంది.

## కోరిక తీరేనా?

పౌరాణిక పాత్ర పోషించాలని వుందంటున్నాడు శ్రీకాంత్. 'ఘటోత్కచుడు', 'దేవుళ్ళు' చిత్రాలలో అతిథి పాత్రల్లో పౌరాణిక పాత్రల్లో నటించినా 'తనివి తీరలేదే నా మనసు నిండలేదే' అంటూ పాటలు పాడుకుంటున్నాడు.(స్వగతంలోనే లెండి) తాను సినిమా రంగం నుండి నిష్క్రమించే లోగా పూర్తి నిడివి గల పౌరాణిక పాత్రను పోషించి తన చిరకాల కోరిక తీర్చుకుంటానని శపథం చేస్తున్నాడు. ఆకారం సరిపోయినా,ఏకబిగిన డైలాగ్ చెప్పగలిగే సత్తా వుందా? అన్న ప్రశ్నలు వినబడుతున్నాయి.

